క్లుప్తంగా

ప్రభుత్వ పాఠశాలనే ఎంపిక చేసుకోండి



ఇంటింటి ప్రచారం చేస్తున్న చినబంటుపల్లి ప్రాథమిక పాఠశాల హెచ్ఎం రాంబాబు

మెరకముడిదాం: నాణ్యమైన విద్యకు ప్రభుత్వ పాఠశాలనే ఎంపిక చేసుకోవాలని చినబంటుపల్లి ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ఆల్తి రాంబాబు తల్లిదండ్రులకు సూచించారు. చినబంటు పల్లి గ్రామంలో ఆదివారం ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. తమ పాఠశాలలో అన్ని సదుపాయాలతో నిష్ణాతులైన ఉపాధ్యాయులున్నారని, పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు.ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యాబోధన చేస్తున్నా మని చెప్పారు.

మరుగుదొడ్ల సంగతి ఏంటి..?



ఎస్సీ బాలుర కళాశాల వసతి గృహంలో శిథిలావస్థకు చేరకున్న మరుగుదొడ్లు

చీపురుపల్లి: స్థానిక కొత్తగవిడివీధిలోని ఎస్సీ బాలుర కళాశాల వసతి గృహంలో మరుగుదొడ్ల మరమ్మతులు సంగతేంటని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. వసతి గృహంలో మరుగుదొడ్లు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నా యి. వసతిగృహం ఆధునికీకరణకు సాంఘిక సంక్షేమశాఖ నుంచి రూ.18 లక్షలు మంజూరయ్యా యి. కొద్ది నెలల క్రితమే టెండర్ల ప్రక్రియ పూర్తి కావడంతో పనులు ప్రారంభమయ్యాయి. ఈ నిధులతో వసతి గృహానికి కొత్తగా స్లాబు వేయడం, కిటికీలు, ప్రధాన ద్వారాలు ఏర్పాటు చేయడంతో పాటు పెయింటింగ్స్, తదితర పనులు చేపట్టనున్నారు. మరుగుదొడ్ల మరమ్మతుల ఊసే లేకపోవడంతో విద్యార్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తు న్నారు. తాజాగా మంజూరైన నిధులతో కొత్త మరుగుదొడ్లు నిర్మించడమో లేక మరమ్మతులు చేయడమో చేస్తారనుకుంటే అలాంటి పరిస్థితి కనిపించడం లేదని విద్యార్థులు చెబుతున్నారు.

16న కలెక్టరేట్ వద్ద ధర్నా

బొండపల్లి: గ్రీన్ ఫీల్డ్ హైవేలో భాగంగా హెచ్పీసీఎల్ డీజిల్, పెట్రోలు పైపులైన్ల ఏర్పాటుకు భూములు కోల్పోయే రైతులకు మెరుగైన నష్ట పరిహా రం అందించాలన్న డిమాండ్‌తో ఈనెల 16వ తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నా చేయనున్నట్లు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బి.రాంబాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలాల వారీగా పైపులైన్ వెళ్లే గ్రామాల రైతులు తమ అభ్యంతరాలను తెలియజేసే వినతిపత్రాలను తీసుకుని ధర్నాకు తరలి రావాలని పిలుపునిచ్చారు. అధికారులకు రైతులు తమ అభ్యంతరాలను తెలియజేయడం ద్వారానే న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు.

రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోండి

దత్తిరాజేరు: కొత్తగా రేషన్ కార్డులు కావాల్సిన వారు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ విజయభాస్కర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌లో నమోదై ఉండి, వార్షిక ఆదాయం రూ.1.20 లక్షలలోపు ఉన్న వారు అర్హులని స్పష్టం చేశారు. సచివాలయంలో దరఖాస్తు చేసుకునే సమయం లో కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులను చూపించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. రేషన్ కార్డుల్లో చేర్పులకు, వివాహం అయిన వారిని తొలగించడాని కి ప్రభుత్వం అవకాశం కల్పించిందని తెలిపారు.

మట్టి రోడ్డుతో అవస్థలు



తాటిపూడి నుంచి రాగోలుకు వెళ్లే మట్టిరోడ్డు

గుర్ల: మండలంలోని గొలగాం నుంచి రాగోలుకు వెళ్లే కిలోమీటరు మేర మట్టిరోడ్డులో ఎక్కడిక క్కడ గోతులు తేలడంతో రాకపోకలకు సాగించేందుకు రాగోలు గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. చిన్నపాటి వర్షానికే రోడ్డుపై గుంతల్లో నీరు నిలిచిపోతుండడంతో ద్విచక్ర వాహనాలతో సైతం ప్రయాణించడం నరకంలా ఉంటోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాగోలు నుంచి మండల కేంద్రం గుర్లకు వెళ్లేందుకు నెల్లిమర్ల మండ లంలోని అలుగోలు మీదుగా చుట్టూ తిరిగాల్సి వస్తోందని, అధికారులు స్పందించి తారు రోడ్డు నిర్మాణానికి కృషి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. సమస్యను పంచాయతీ రాజ్ జేఈ రమేష్ వద్ద సాక్షి ప్రస్తావించగా...తాటిపూడి నుంచి రాగోలు వరకు తారురోడ్డు నిర్మాణానికి రూ.80 లక్షలు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభి స్తామని తెలిపారు.

ఉచిత సీట్లపై ప్రచార లోపం..!

- విద్యా హక్కు చట్టం ప్రకారం పేదపిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో 25 శాతం ఉచిత సీట్లు
- 2025-26 విద్యా సంవత్సరానికి తాజాగా నోటిఫికేషన్ విడుదల చేసిన ప్రభుత్వం
- ఉచిత సీట్లపై అవగాహన కల్పించడంలో విద్యాశాఖ అలసత్వం
- మండల విద్యాశాఖ కార్యాలయాల్లో కానరాని హెల్ప్‌డెస్క్‌లు
- సచివాలయాల వద్ద కనిపించని ఫ్లెక్సీలు, పోస్టర్లు
- దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 15వ తేదీతో ముగియనున్న గడువు



మెరకముడిదాం మండల విద్యావనరుల కేంద్రం

మెరకముడిదాం: పేద పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలపై అవగాహన కల్పించడంలో క్షేత్రస్థాయిలో విద్యాశాఖ అలసత్వం వహిస్తోంది. విద్యాహక్కు చట్టం-2009 సెక్షన్ 12(1)సీ ప్రకారం ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు తమ పాఠశాలల్లో 1వ తరగతిలో 25 శాతం సీట్లను పేద పిలలకు ఉచితంగా కేటాయించాల్సి ఉంటుంది. కానీ ఎక్కడా ఈ విధానం పూర్తి స్థాయిలో అమలు కావడం లేదు. ఇందుకు ప్రధాన కారణం ప్రజల్లో అవగాహన లేకపోవడంతో పాటు విద్యాశాఖ ప్రచారం చేయకపోవడమే. ప్రైవేటు పాఠశాలల్లో పేద పిల్లలకు ఉచిత సీట్ల కేటాయింపు అనేది నీటి మీద రాతలా మిగిలిపోతోందన్న ఆరోపణలు విద్యావేత్తల నుంచి వినిపిస్తున్నాయి. ఉచిత సీట్లపై గ్రామ, మండల స్థాయిల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆ శాఖ జిల్లా, మండల అధికారులను ఆదేశించారు. ఈవిషయంపై పత్రికల్లో ప్రకటనలు ఇవ్వాలని, మండల విద్యాశాఖ కార్యాలయాల వద్ద ఫ్లెక్సీలు, గ్రామ సచివాలయాల వద్ద పోస్టర్లు తప్పనిసరిగా ప్రదర్శించాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న దగ్గర నుంచి అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయ్యే వరకు అవగాహన కల్పించడంతో పాటు పిల్లల తల్లిదండ్రుల సందేహాల నివృత్తికి, వారికి సహాయం, సూచనలు చేసేందుకు మండల స్థాయిలో హెల్ప్‌డెస్కులు కూడా ఏర్పాటు చేయాలి. ఫేస్‌బుక్, ఎక్స్, యూట్యూబ్, లోకల్ మీడియాల్లో కానీ ప్రచారం చేయాలి. కానీ సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో ఇవేమీ చేయకపోవడంతో ప్రైవేటు పాఠశాలల్లో ఉచితంగా సీటు ఇస్తారనే సంగతి తల్లిదండ్రులకు తెలియకపోవడంతో దరఖాస్తులు చేసుకోవడం లేదు.

అర్హతలు..దరఖాస్తు చేసుకునే విధానం..

ఎస్సీ,ఎస్టీ, బీసీ,ఓసీ, మైనార్టీ, అనాథ పిల్లలు, హెచ్ఐవీ బాధిత, దివ్యాంగ పిల్లలు అర్హులు. 2019 ఏప్రిల్ 2 నుంచి 2020 మార్చి 31 మధ్య జన్మించి ఉండాలి. సీట్ల ఎంపికలో ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న వర్గాల వారి పిల్లలు, అనాథ పిల్లలు, హెచ్ఐ వీ బాధిత పిల్లలు, దివ్యాంగులకు 5 శాతం, షెడ్యూల్ తెగలకు 4 శాతం, షెడ్యూల్ కులాలకు 10 శాతం, బలహీనవర్గాలకు (బీసీ,మైనార్టీ, ఓసీ)చెందిన పేదకుటుంబాల పిల్లలకు 6 శాతం సీట్లను కేటాయిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే వారి కుటుంబ వార్షిక ఆదాయం రూ.1.20 లక్షలు లోపు, పట్టణ ప్రాంతాల్లో నివసించే వారి కుటుంబ వార్షిక ఆదాయం రూ.1.44 లక్షల లోపు ఉండాలి. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఏప్రిల్ 28వతేదీన ప్రారంభం కాగా, ఈనెల15వ తేదీతో ముగియనుంది. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సీఎస్ఈ.ఏపీ.జీఓవి.ఇన్ వెబ్‌సైట్ లేదా సమీపంలోని గ్రామ/వార్డు సచివాలయాలు, మండల విద్యాశాఖ కార్యాలయంలో కానీ దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తులను మే 16వ తేదీ నుంచి 20 వ తేదీ వరకు పరిశీలించి గ్రామ సచివాలయాల డేటా ఆధారంగా మ్యాపింగ్ చేసిన పాఠశాలలకు అర్హతలు నిర్ణయిస్తారు. మే 21 నుంచి 24 వరకు లాటరీ ద్వారా మొదటి దశలో సీట్లు కేటాయిస్తారు. వీరికి జూన్ 2వ తేదీ నుంచి ప్రవేశాలు కల్పిస్తారు. సీట్లు నిండకపోతే రెండో జాబితాను జూన్ 6వ తేదీన విడుదల చేస్తారు. వీరికి జూన్ 12 నుంచి అడ్మిషన్లు కల్పిస్తారు.

2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి...

2025- 26 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు ఒకటో తరగతిలో 25 శాతం ఉచిత సీట్లు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం తాజాగా నోటిఫికేషన్ విడుదల చేసింది. ఐబీ, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, స్టేట్ సిలబస్‌ను బోధిస్తున్న అన్ని ప్రైవేటు, అన్‌ఎయిడెడ్ పాఠశాలలకు ఈ ఉత్తర్వులు వర్తిస్తాయని ప్రభుత్వం నోటిఫికేషన్‌లో పేర్కొంది.

దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి సురేష్

చీపురుపల్లి: లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ కార్మికుల హక్కుల రక్షణ కోసం ఈనెల 20న తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ కోరారు. దేశ వ్యాప్త సమ్మెపై సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జీపు జాతా ఆదివారం సాయంత్రం పట్టణంలోని మూడు రోడ్ల జంక్షన్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులను కట్టుబానిసలుగా తయారు చేసేందుకు కార్మిక చట్టాలను రద్దు చేస్తూ వాటి స్థానంలో కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకొచ్చిందన్నారు. తక్షణమే వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో, హమాలీ, భవన నిర్మాణం వంటి అసంఘటిత రంగ కార్మికుల కు సంక్షేమ బోర్డు ద్వారా పథకాలు అమలు చేసి న్యాయం చేయాలని డిమాం డ్ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ఆశ వర్కర్లు, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు, వీఓఏ, శానిటరీ వర్కర్స్ అందరినీ శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ వంటి నిత్యావసర సరుకుల ధరలను తక్షణమే తగ్గించాలని కోరారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏ.జగన్‌మోహన్, నాయకులు టి.వి.రమణ, తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో విద్యుత్ స్తంభం



శిథిలావస్థకు చేరుకున్న విద్యుత్ స్తంభాన్ని చూపిస్తున్న రైతు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని చుక్కవలస రెవెన్యూ పరిధిలో చీపురుపల్లి మండలం, రామలింగాపురం గ్రామానికి చెందిన రైతు ఇప్పిలి నీలకంఠం పొలంలో ఉన్న ఓ విద్యుత్ స్తంభం శిథిలావస్థకు చేరుకుంది. స్తంభం సిమెంట్ పెచ్చులూడి, ఇనుప ఊచలు బయటకి కనిపిస్తూ ఏ క్షణంలోనైనా కూలిపోయేలా ప్రమాదకరంగా ఉంది. ప్రమా దం సంభవించక ముందే శిథిల విద్యుత్ స్తంభాన్ని తొలగించి, కొత్తది ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ సిబ్బందిని ఎన్నిసార్లు కోరినా పట్టించుకోలేదని రైతు నీలకంఠం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఎన్నోఏళ్ల క్రితం వేసిన విద్యుత్ తీగలు కావడంతో తరచూ తెగిపడుతున్నాయని చెప్పారు. విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి కొత్త విద్యుత్ స్తంభం వేయాలని, కాలం చెల్లిన తీగల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని రైతు కోరుతున్నారు.

రైల్వే ప్రయాణికులకు ధూళి కష్టాలు



రైల్వేస్టేషన్ మూడో ప్లాట్‌ఫామ్ అవతలి వైపు క్వార్ట్ రాయి అన్‌లోడింగ్ సమయంలో ఎగసిపడుతున్న ధూళి

చీపురుపల్లి: స్థానిక రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు ధూళి కష్టాలు తప్పడం లేదు. రైలు ఎక్కేందుకు వెళ్లే ప్రయాణీకులు ఆ రైలు వచ్చేంత వరకు ఎదురు చూసే సమయంలో మొత్తం ధూళి, దుమ్ము పట్టాల్సి వస్తోంది. స్థానిక రైల్వేస్టేషన్‌లో మూడో ఫ్లాట్ ఫామ్‌కు అవతలి వైపు క్వార్జ్ రాయిని గూడ్సు రైళ్లలో ఎగుమతి చేస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి లారీల్లో క్వార్జ్ రాయిని ఇక్కడికి తీసుకొచ్చి మూడవ నంబర్ ప్లాట్‌ఫామ్‌కు అవతలి వైపు అన్‌లోడింగ్ చేస్తుంటారు. ఆ తర్వాత అదే క్వార్జ్ రాయిని జేసీబీల సహాయంతో గూడ్సు రైళ్లలోకి లోడింగ్ చేస్తుంటారు. ఈ సమయంలో పెద్ద ఎత్తున ఎగసి పడుతున్న దుమ్ము, ధూళితో ఇబ్బందులు పడాల్సి వస్తోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లోడింగ్, అన్‌లోడింగ్ సమయంలో క్వార్జ్ రాయిపై నీళ్లు చల్లితే కొంత ధూళి తగ్గే అవకాశం ఉందని, కానీ అలాంటి చర్యలు చేపట్టడం లేదని ప్రయాణికులు అంటున్నారు. చీపురుపల్లి రైల్వేస్టేషన్ నుంచి రోజూ విశాఖ ఎక్స్‌ప్రెస్‌తో పాటు మెయిల్, ప్రశాంతి, కోరమండల్ వంటి సూపర్ ఫాస్ట్ రైళ్ల రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో పాటు ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, ఈఎంయూ, డీఎంయూ వంటి ప్యాసింజర్ రైళ్లు వెళుతుంటాయి. చీపురుపల్లి, రాజాం, మెరకముడిదాం, గరివిడి, లావేరు తదితర ప్రాంతాలకు చెందిన వందలాది మంది ప్రయాణికులు ఈ రైల్వేస్టేషన్‌నే ఆశ్రయిస్తుంటారు. చాలా కాలంగా ఈ సమస్య ఉన్నప్పటికీ రైల్వే అధికారులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు విమర్శిస్తున్నారు.

వైభవంగా వేణుగోపాలుడి కల్యాణోత్సవాలు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. కల్యాణోత్సవాల్లో భాగంగా స్వామి సన్నిధిలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిపించారు. వేకువజామున ప్రాతః కాలార్చన, బాలభోగం నిర్వహించిన తర్వాత యాగశాలలో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, అగ్ని ప్రతిష్ఠాపన, ఆదిత్య హృదయ హోమం, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం స్వామివారి సుదర్శన పెరుమాళ్లకు చక్రతీర్థ స్నానం జరిపిస్తామని అర్చకులు తెలిపారు.

రైల్వేస్టేషన్లు, ఆర్టీసీ కాంప్లెక్స్‌ల్లో తనిఖీలు



చీపురుపల్లి రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల బ్యాగులను తనిఖీ చేస్తున్న ఎస్ఐ దామోదరరావు, పోలీస్ సిబ్బంది

చీపురుపల్లి : జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు భద్రతా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ ఎల్.దామోదరావు చెప్పారు. ఆదివారం సాయంత్రం 4 గంటల నుంచి 6గంటల వరకు పట్టణంలోని రైల్వేస్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్సుతో పాటు ప్రధాన కూడళ్లలో ప్రయాణికులు, అనుమానిత వ్యక్తుల కదలికలపై నిఘా పెట్టారు. రైల్వేస్టేషన్‌లో పలువురు బ్యాగులు తనిఖీలు చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ఎవరైనా అపరిచిత, అనుమానిత వ్యక్తులు గ్రామాల్లోకి వస్తే తక్షణమే పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు.

కొత్తవలస, ఎస్.కోటలో..

కొత్తవలస/శృంగవరపుకోట: కొత్తవలస రైల్వేస్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్, కంటకాపల్లి రైల్వేస్టేషన్‌లో కొత్తవలస సీఐ షణ్ముకరావు, ఎస్.కోట రైల్వే స్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఎస్ఐ గంగరాజు ఆదివారం మధ్యాహ్నం తనిఖీలు చేశారు. ప్రయాణికుల బ్యాగులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎస్.కోట,కొత్తవలస పోలీసులు పాల్గొన్నారు.



కొత్తవలస: కొత్తవలస రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న సీఐ షణ్ముకరావు, పోలీస్ సిబ్బంది



కొత్తవలస: కొత్తవలస ఆర్టీసీ కాంప్లెక్స్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు



శృంగవపుకోట: ఎస్.కోట రైల్వేస్టేషన్ వద్ద పోలీసుల పహారా

తల్లికి వందనం



మదర్స్ డే సందర్భంగా వేపాడ మండలంలోని వేపాడ, వల్లంపూడి, చామలాపల్లి తదితర గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆదివారం తల్లికి వందనం కార్యక్రమం నిర్వహించారు. ఆయా కేంద్రాల్లో చిన్నారులు తమ తల్లుల పాదాలు కడిగి పూజ చేశారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు మంగలక్ష్మి, రాజేశ్వరి, దేవి, ఈశ్వరమ్మ, లత, నూకరత్నం తదితరులు మాట్లాడుతూ తల్లిదండ్రులు, గురువులు దైవంతో సమానమని పిల్లలకు వివరించారు. - వేపాడ

యథేచ్ఛగా మట్టి తవ్వకాలు



గుర్ల మండల కేంద్రంతో పాటు గోషాడలోని తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్ట్ కుడి, ఎడమ కాలువలపై మట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగిపోతున్నాయి. పగలు, రాత్రి సంబంధం లేకుండా జేసీబీలతో తవ్వకాలు జరిపి రియల్ ఎస్టేట్ వెంచర్లకు లారీ, ట్రాక్టర్లతో మట్టిని తరలించుకుపోతున్నారు. మట్టితవ్వకాలపై తారకరామ తీర్థ సాగర్ ప్రాజెక్ట్ అధికారులకు, రెవెన్యూ సిబ్బందికి స్థానికులు సమాచారం ఇచ్చినప్పటికీ పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. -గుర్ల

ఆత్మీయ సమ్మేళనం



ఎస్.కోట మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000వ సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆ పాఠశాల వేదికగా ఆదివారం జరిగింది. ఉన్నత చదువుల కోసం వేర్వేరు ప్రాంతాలకు వెళ్లి పోయి, ఆ తర్వాత వివిధ వృత్తుల్లో స్థిరపడిన వారంతా 24 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. పరస్పరం యోగక్షేమాలు, కుటుంబ జీవితం గురించి తెలుసుకుని, చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. రోజంతా సందడిగా గడిపారు. - శృంగవరపుకోట

ముగిసిన నూకాలమ్మ ఆలయ ప్రతిష్ఠోత్సవాలు



అమ్మవారికి పూజలు చేస్తున్న పురోహితులు



యూట్యూబర్ హర్షసాయికి స్వాగతం పలుకుతున్న పురోహితులు, యువత

వేపాడ: కుమ్మపల్లి గ్రామంలో మూడురోజులుగా నిర్వహించిన నూకాలమ్మ ఆలయ ప్రతిష్ఠోత్సవాలు ముగిశాయి. గ్రామ పురోహితులు భమిడిమర్రి శ్రీనివాసశర్మ నేతృత్వంలో వేదపండితులు అమ్మవారి విగ్రహాన్ని ఆదివారం ప్రతిష్ఠించారు. అనంతరం అమ్మవారికి పట్టువస్త్రాలను అలంకరించి, పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేశారు. యూట్యూబర్ హర్షసాయి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకి స్థానిక యువత, పురోహి తులు, ఆలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం సత్కరించారు.

అమ్మ.. మానవత్వానికి ప్రతిరూపం



కేక్ కట్ చేసి మాతృమూర్తులను అభినందిస్తున్న సిస్టర్ సువర్ణ, రవికుమార్ తదితరులు

విజయనగరం టౌన్: మానవత్వానికి ప్రతిరూపం అమ్మ అని ఏసు ప్రేమాలయం చర్చి పాస్టర్ అలజంగి రవికుమార్ అన్నారు. సిస్టర్ సువర్ణ ఆధ్వర్యంలో చర్చి ఆవరణలో ఆదివారం మాతృ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సిస్టర్ సువర్ణ మాట్లాడుతూ.. దేవుని సేవలో ఉన్న ప్రతి ఒక్కరూ అమ్మను గౌరవించాలని.. వృద్ధాప్యంలో తల్లిదండ్రులను అక్కున చేర్చుకోవాలని సూచించారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో చింతాడ సువార్తమ్మ, ఝాన్సీ సుజాన్ ఈశ్వరమ్మ, నరసయ్యమ్మ, లక్ష్మి, శ్రీదేవి, మేరీ రత్నం, అనూషా, మాడీ, లిక్కి, అలేఖ్య, దీవెన, తదితరులు పాల్గొన్నారు.

మాతృమూర్తి లేనిదే సమాజ మనుగడ లేదు..

విజయనగరం టౌన్: మాతృమూర్తి లేనిదే సమాజ మనుగడ లేదని బ్రహ్మకుమారీస్ జిల్లా ఇన్‌చార్జ్ బీకే అన్నపూర్ణ తెలిపారు. స్థానిక కంటోన్మెంట్‌లో ఉన్న బ్రహ్మ కుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం సేవా కేంద్రంలో ఆదివారం రాత్రి మాతృ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక సందేశాన్ని ఆమె అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ చైర్‌పర్సన్ పాలవలస యశస్వి, వెంకటపద్మ ఆస్పత్రి వైద్యులు ఎం.పద్మకుమారి, తదితరులు పాల్గొన్నారు.